

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పాలమూరు ఎమ్మెల్సీ బరిలో బీఆర్ఎస్

- జిల్లా నేతలతో కేటీఆర్ భేటీ

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రానున్న లోక్‌సభ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. ఇప్పటికే ఒక ఎమ్మెల్సీ స్థానానికి నోటిఫికేషన్ విడుదలై నామినేషన్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో దీనిపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానంతో పాటు నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానంలో అనుసరించాల్సిన వ్యూహాలపైనా చర్చించారు. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాలపై పార్టీ అధినేత కేసీఆర్ మంగళవారం విస్తృతస్థాయి సన్నాహక సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు నియోజకవర్గాల్లో పార్టీ విజయావకాశాలు బలంగా ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లాకు చెందిన మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పాపడాలు, నిరోధ్‌లు అమ్ముతున్నరా?

మొదటిపేజీ తరువాయి...

నేతన్నలపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడారు. ఇందుకు సంబంధించిన ఇద్దరి మధ్య సంభాషణ సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'సిరిసిల్ల నేతన్నలు ఎంత మంది పాపడాలు అమ్ముకుంటున్నారు? ఎంత మంది నిరోధ్‌లు అమ్ముతున్నారు? బతుకమ్మ చీరలతో ఆరేండ్ల నుంచి దొబ్బి తిన్నది చాలదా?' అంటూ దురుసుగా మాట్లడటంపై పద్మశాలి సామాజికవర్గం కేకేపై ఫైర్ అయ్యింది. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్డర్ల ఊసెత్తకపోవడంపై నేతన్నల్లో ఆందోళన కనిపిస్తున్నది. రూ.270 కోట్ల బకాయిలు సైతం విడుదల చేయలేదు. ప్రభుత్వం ఇచ్చిన వస్త్ర ఆర్డర్ల కోసం.. అప్పులు తెచ్చి ముడిసరుకులు కొనుక్కొచ్చిన యజమానులంతా దివాలా తీసే పరిస్థితి నెలకొంది. తెచ్చిన అప్పులకు వడ్డీ కట్ట లేక సాంచాలను బంద్ పెట్టారు. సిరిసిల్లలో 30 వేల మరమగ్గాలుంటే అందులో 20 వేల వరకు మూతపడ్డాయి. బకాయిలు చెల్లించి, కొత్త ఆర్డర్లు ఇవ్వాలని గత నెలలో సీఐటీయూ ఆధ్వర్యంలో నేతన్నలు మహాధర్నా చేసి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. అయినా.. ప్రభుత్వం నుంచి స్పందన లేదు. పైగా ఆపార్టీ నేతలంతా నేతన్నలపై దురుసుగా మాట్లాడుతూ నోరు పారేసుకోవడంపై పద్మశాలీలంతా మండిపడుతున్నారు.

ఆడియో సంభాషణ సాగిందిలా..

విలేకరి: సర్ నమస్కారం. ఎక్కడున్నరు?

కేకే మహేందర్‌రెడ్డి : మేం సిరిస్లిలో ఉన్నం. మేం అమెరికా పోయి రాజకీయం చేత్తమా ఏంది? ఎవరెవరు పాపడాలు అమ్ముతున్నరు? ఎవరెవరు నిరోధ్ ప్యాకెట్లు అమ్ముతున్నారు?

విలేకరి: పద్మశాలీలది. అది వైరల్ అయింది.

కేకే: వాడు మొదటి నుంచీ అమ్ముతడు. అదే బ్యారం చేస్తడు.

విలేకరి : సెల్ఫీ వీడియో పెట్టుకున్నడు. పద్మశాలి జేఏసీ గ్రూపులో వచ్చింది.

కేకే : వాడు ఆసామే గనీ, మొదటి నుంచి పాపడాలు అమ్ముతడు? నీ మీది రిపోర్ట్ చేయించి కేస్ వేయిద్దామనుకున్నా.

విలేకరి : పద్మశాలీలీ జేఏసీ ఫేస్‌బుక్కుల, యూట్యూబ్‌ల పెట్టుకున్నదే కదా?

కేకే : వాళ్లు పెట్టుకుంటే నువ్వెట్ల పెడుతవ్?

విలేకరి : సిరిస్లిల నేత కార్మికుడు కదా? మనం ప్రభుత్వానికి విన్నవించాలి కదా? బతుకమ్మ చీరల ఆర్డర్లు ఏమైనా ఇస్తరా? అంతేన కథ?

కేకే : ఏం ఆర్డర్లు? ఆరేండ్ల నుంచి దొబ్బితిన్నది సరిపోదా?

విలేకరి : గల్ఫ్ నుంచి వాళ్లను పరామర్శిద్దామని నేను పెద్దారుకు వచ్చిన.

కేకే : మీ సారు ఏం చేసిండయ్య దానికి? పెద్దగా పెడుతున్నవ్

విలేకరి : ఏదైనా.. 35 లక్షలు పెట్టిండు కదా. మీరు ఒకసారి పరామర్శించండి. వాళ్లకు ప్రభుత్వం తరపున ఏదైనా ఉపాధి చూపండి.

కేకే: నువ్వు కేటీఆర్‌కు చెప్పి ఓ నలభై యాభై ఇప్పియ్యు

విలేకరి : సర్ పైసలు కాదు. ఉపాధి మార్గం చూపియండి.

కేకే : ఏం ఉపాధి చూపుతమయా. కలెక్టరే సరిగ్గా పనిచేస్తలేడు. ఏం చేస్తడు? ఉదయం ఇటు మాట్లాడుతడు. సాయంత్రం అటు మాట్లడుతడు

విలేకరి : ఉంటరా సర్. వచ్చిన తర్వాత ఫోన్ చేస్త. ఇది పార్టీలకు సంబంధం లేదు. మన సిరిసిల్ల వాళ్లను మనం కాపాడుకోవాలె

కేకే : మీ కేటీఆర్‌ను దేవుడని చెప్పిస్తున్నవ్. ఆయన దేవుడైన తర్వాత మేం దయ్యాలమా?

విలేకరి : అలా కాదు సర్. రాజకీయాలు వేరు. హ్యూమన్ బీయింగ్ వేరు

కేకే : అట్లిటుంటది? అడ్డంగ నరుక్కుంట పోవాలె.

కేకే క్షమాపణ చెప్పాలి..

నేతన్నలపై దురుసుగా మాట్లాడిన కేకే మహేందర్‌రెడ్డి వెంటనే నేతన్నలకు క్షమాపణ చెప్పాలని పద్మశాలి సామాజికవర్గం డిమాండ్ చేసింది. ఈ మేరకు సిరిసిల్ల పద్మశాలి సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, పట్టణ ఉపాధ్యాక్షుడు డాక్టర్ గాజుల బాలయ్య, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బొల్లి రాంమోహన్, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, దార్ల సందీప్‌లు కేకే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పద్మశాలీలను అవమానపరిచిన కేకే మహేందర్‌రెడ్డి సిరిసిల్ల నేతన్న విగ్రహం వద్దకు వచ్చి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపట్టి ఈ నెల 7న సిరిసిల్ల సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో సిరిసిల్లకు వచ్చిన ఉద్యమ నేత కేసీఆర్ ఇక్కడి నేతన్నల దయనీయ పరిస్థితికి చలించి పార్టీ ఫండ్‌గా రూ.50 లక్షలు అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఏర్పడ్డ టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కేటీఆర్ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వస్త్ర పరిశ్రమకు జీవం పోశారని వివరించారు.

దోచుకొనేందుకేనా ఎల్ఆర్ఎస్?

- 20వేల కోట్ల వసూలుకు సిద్ధపడ్డారు
- మా ప్రభుత్వంపై కేసు వేసిన కోమటిరెడ్డి.. ఇప్పుడు మరో కేసు వేస్తారా?
- నాడు పథకాన్నే రద్దు చేస్తామన్నారు.. ఇప్పుడెందుకు అమలు చేస్తున్నారు?
- దోపిడీ అన్న సీతక్క మాట్లాడరేం?
- కాంగ్రెస్ సర్కార్‌కు కేటీఆర్ నిలదీత
- ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని బీఆర్ఎస్ ఆందోళనలు
- రేపు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు
- 7న జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చిన విధంగా ఉచితంగా అమలుచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ పేరిట 25 లక్షల మంది దరఖాస్తుదారుల నుంచి రూ.20 వేల కోట్ల వరకు వారి రక్త మాంసాలను పీల్చడానికి సిద్ధమయ్యారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ మంత్రులు సీ లక్ష్మా రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి, మంత్రులు..భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క తదితరులు ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు కట్టవద్దని, తాము అధికారంలోకి రాగానే ఉచితంగా అమలు చేస్తామంటూ మాట్లాడిన వీడియోలను కేటీఆర్ మీడియాకు ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలుగా మ్యానిఫెస్టోలో 420 హామీలు, 6 గ్యారెంటీలను ఇచ్చారని, కానీ బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలనే కొనసాగిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

మాట మార్చిన కాంగ్రెస్ నేతలు

వచ్చేది తమ ప్రభుత్వమేనని, ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని అప్పటి సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నో-ఎల్ఆర్ఎస్ నో-బీఆర్ఎస్ అన్నారని, తాము అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. అలాంటిది ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా 25.44 లక్షల మంది లబ్ధిదారుల నుంచి రూ.20 వేల కోట్లను దోచుకోవడానికి సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. ప్రజల నుంచి ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల రెగ్యులరైజేషన్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని అన్నారు. గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం మార్గదర్శకాలు రూపొందించినప్పుడు, ఇదే కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడిన విషయాన్ని కేటీఆర్ సాక్ష్యాలతో సహా మీడియా ముందుంచారు. నాడు తమ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను ప్రతిపాదించినప్పుడు.. ప్రజల నుంచి డబ్బు దోచుకోవడానికే ఈ కార్యక్రమం చేపట్టారని భట్టి విక్రమార్క విమర్శించారని, మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడెందుకు ఆ పథకం అమలుకు సిద్ధపడుతున్నదని నిలదీశారు. ఒకప్పుడు నో ఎల్ఆర్ఎస్ – నో బీఆర్ఎస్ అన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రజలు నో కాంగ్రెస్ అంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. అప్పుడు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని చెప్పి ఈ రోజు అడ్డగోలుగా డబ్బులు లాక్కోవడంపై స్పందించాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క డబ్బులు దోచుకోవడానికే ఎఆర్ఎస్ పెట్టారని మాట్లాడారని ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి దోచుకుంటున్నప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌పై కోర్టులో కేసు వేసిన మంత్రి కోమటిరెడ్డి ఇప్పుడు ఆ కేసును వెనక్కి తీసుకున్నారా లేక ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో కేసు వేస్తారా అనే విషయాన్ని తెలియజేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ప్రజలపై 20వేల కోట్ల భారం

ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న 25.44 లక్షల మంది దరఖాస్తుదారులపై కనీసం లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.20వేల కోట్ల వరకు భారాన్ని మోపేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమైందని కేటీఆర్ విమర్శించారు. ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు కేటీఆర్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ మోసపూరిత వైఖరికి వ్యతిరేకంగా ధర్నాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ నెల 7న ప్రతి జిల్లా కలెక్టర్‌కు, అర్డీవోలకు ఒక విజ్ఞాపన పత్రాలను అందిస్తామని తెలిపారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ),గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కార్యాలయాల ముందు ప్రత్యేక నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్ కార్యక్రమంలో ఎలాంటి చార్జీలు వసూలు చేయబోమని ప్రకటించాలని, లేకుంటే భవిష్యత్తులో న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

ఏప్రిల్ 17న శ్రీరాముడి కల్యాణం

తర్వాతి రోజు రామయ్యకు మహాపట్టాభిషేకం

భద్రాచలం, మార్చి 4: దక్షిణ అయోధ్యపురి భద్రాద్రిలో కొలువైన రామయ్య కల్యాణ మహోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఆలయ వైదిక కమిటీ ఈ మేరకు సోమవారం ఆలయ ఈవో రమాదేవికి నివేదిక అందించింది. ఏప్రిల్ 17న పట్టణంలోని మిథిలా ప్రాంగణంలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. తదుపరి రోజు శ్రీరామయ్యకు మహాపట్టాభిషేకం చేయనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 9 నుంచి ఆలయ సన్నిధిలో 23వ తేదీ వరకు వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి నవాహ్ని తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఏప్రిల్ 9 నుంచి 23 వరకు స్వామివారి నిత్యకల్యాణం, దర్బార్ సేవలు, ఏప్రిల్ 9 నుంచి మే 1 వరకు పవళింపు సేవలు నిలిపివేస్తున్నట్టు ఆలయ ఈవో తెలిపారు.

మండుతున్న భానుడు

పలు జిల్లాల్లో 4 నుంచి 5 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): వేసవి ప్రారంభమైందో లేదో అప్పుడే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 4 నుంచి 5 డిగ్రీల మేర ఒక్కసారిగా పెరిగింది. ఇప్పటికే అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో వడగాలులు ప్రారంభమయ్యాయి. సాధారణంగా ఏప్రిల్ రెండోవారం, మే నెలలోనే ఇంతలా ఎండ తీవ్రతలను చూస్తుంటాం. కానీ ఈ ఏడాది కాస్త ముందే ఎండలు మండిపోతున్నాయి. ఇండస్ట్రీయల్ ఏరియాలో ఎండ మరీ ఎక్కువగా ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఏపీలోనూ మార్చి నుంచే తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలున్నాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ఎండలపై సమాచారం కోసం విపత్తు నిర్వహణ సంస్థ 112, 1070, 18004250101 టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటుచేశారు.

యాదాద్రి అడిషనల్ కలెక్టర్ సస్పెన్షన్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) / భువనగిరి కలెక్టరేట్: ఒకే పార్లమెంట్ పరిధిలో మూడేండ్ల సర్వీసు పూర్తయినా, కానట్లుగా ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చిన భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఏ భాస్కర్‌రావును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. భువనగిరి లోక్‌సభ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఉన్న భాస్కర్‌రావు బదిలీ కాకూడదని తప్పు సమాచారం ఇచ్చినట్టుగా నిర్ధారించుకుని సోమవారం రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేశారు.

శ్రీశైలం మల్లన్నకు తిరుమల వెంకన్న పట్టువస్త్రాలు

స్థలమిస్తే..200 గదుల భవనం కడతాం: టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీశైలంలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి తరపున టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నాలుగో రోజైన సోమవారం మయూర వాహనంలో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మయూరవాహనంపై శ్రీశైలం పురవీధుల్లో స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. శివస్వాములతో శ్రీశైలం పోటెత్తింది. భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం టీటీడీ ఈవో ధర్మారెడ్డి కీలక ప్రకటన చేశారు. శ్రీశైలం దేవస్థానం స్థలం కేటాయిస్తే టీటీడీ దేవస్థానం తరపున రెండు వందల గదుల భవనం కడతామని ప్రకటించారు. క్షేత్రంలో టీటీడీ సత్రం పాతపడటంతో వాటిని ఆధునీకరిస్తామని చెప్పారు.

శ్రీకాళహస్తి ఆలయంలో డ్రోన్ కలకలం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): శివరాత్రి సమీపిస్తున్న వేళ శ్రీకాళహస్తీశ్వరాలయంపై ఓ డ్రోన్ ఎగరడం తీవ్ర కలకలం రేపింది. ముక్కంటి ఆలయంపై డ్రోన్ ఎగరవేసి వీడియోలు చిత్రీకరించారు. ఈ ఘటనను గుర్తించిన సెక్యూరిటీ వారిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. ఆలయంపై డ్రోన్ ఎగరవేసినవారు తమిళనాడుకు చెందినవారిగా గుర్తించారు.

చోటే భాయ్‌కా.. బడే భాయ్!

మొదటిపేజీ తరువాయి...

కంటోన్మెంట్ భూములు, స్కైవేలు, ట్రిపుల్ ఆర్, ఐఐహెచ్‌టీ వంటివాటి విషయంలో ముప్పుతిప్పలు పెట్టిన ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సీఎం రేవంత్ ఇలా వెళ్లి రాగానే ఎడాపెడా అనుమతులు వస్తున్నాయి. దీనినిబట్టి రెండుపార్టీల మధ్య ఉన్న బంధం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

నరం లేని నాలుక

నరంలేని నాలుక ఎట్లైనా మాట్లాడుతుందని చెప్తారు. సీఎం రేవంత్‌రెడ్డి విషయంలో ఇది నిజమనే చెప్పుకోవాలి. మోదీపై రేవంత్‌రెడ్డి కొంతకాలంగా తీవ్ర విమర్శలతో విరుచుకుపడుతున్నారు. మోదీ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, వారికి ఇచ్చిన హామీల్లో ఒక్కదానిని కూడా అమలు చేయలేదని దుమ్మెత్తిపోశారు. ప్రజలపై ఆయన రూ.100 లక్షల కోట్ల రుణభారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య ఘర్షణ జరిగి అట్టుడికినా ఒక్కసారి కూడా ప్రధాని వెళ్లలేదని, ఇప్పుడు మళ్లీ విద్వేషాలు రెచ్చగొట్టి లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని.. ఇలా అనేక మాయమాటలు చెప్పారని మండిపడ్డారు. అంతేకాదు, పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ వంటి ప్రాజెక్టులను మోదీ పట్టించుకోలేదని నిప్పులు చెరిగారు. సోమవారం మాత్రం అదే నాలుకతో మోదీని ప్రశంసల్లో ముంచెత్తారు. గతంలో గుజరాత్ మోడల్‌పై తీవ్ర విమర్శలు చేసిన రేవంత్.. గుజరాత్‌లా తెలంగాణ అభివృద్ధికి సాయం చేయాలని విజ్ఞప్తి చేసి అక్కడితో దానిని వదిలేశారు. విభజన చట్టం గురించి కానీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ గురించి కానీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐర్, ఆదిలాబాద్‌లో మూతపడిన సీసీఐ పునరుద్ధరణపై ప్రస్తావించే ధైర్యం చేయలేకపోయారు. ఐదు రోజుల క్రితమే గుజరాత్ మాడల్‌ను తూర్పారబట్టిన సీఎం అంతలోనే జైకొట్టడం విమర్శలకు తావిచ్చింది.

'సయోధ్య' అప్పుడెందుకు లేదు?

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కోరుకుంటున్నామని ప్రధాని, సీఎం చెప్పుకొచ్చారు. ఇందులో భాగంగానే ఇటీవల రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ, రీజినల్ రింగ్‌రోడ్ దక్షిణ భాగం, స్కైవేలకు కంటోన్మెంట్ భూములు వంటివి మంజూరయ్యాయని చెప్తున్నారు. వాస్తవానికి ఇవే విన్నపాలను కేసీఆర్ ప్రభుత్వం ఏండ్ల తరబడి చేసినా కేంద్రం పట్టించుకోలేదు. రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ మంజూరు చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ 2020 డిసెంబర్‌లో కేంద్రానికి లేఖ రాశారు. అప్పటినుంచీ ప్రభుత్వం అనేకసార్లు విజ్ఞప్తులు చేసినా కేంద్రం పట్టించుకున్న పాపాన పోలేదు. కరీంనగర్, మేడ్చల్ మార్గాల్లో స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి 2015లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కంటోన్మెంట్ భూములు కావాలని ప్రతిపాదించింది. 100 ఎకరాల కంటోన్మెంట్ భూములు అప్పగిస్తే అంతకు నాలుగైదురెట్ల ప్రభుత్వ భూములు వేరే చోట ఇవ్వడానికి అంగీకరించింది. పదుల సంఖ్యలో లేఖలు, వినతులు ఇచ్చినా పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి మళ్లీ అవే ప్రతిపాదనలు సమర్పించగానే రక్షణశాఖ భూములు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రీజినల్ రింగ్‌రోడ్ దక్షిణ భాగానిదీ ఇదే పరిస్థితి. కేసీఆర్ ప్రభుత్వం డీపీఆర్ పూర్తిచేసి, దానిని జాతీయ రహదారిగా ప్రకటించాలని అనేకసార్లు కేంద్రాన్ని కోరినా చలనం లేకుండా ఉండిపోయింది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఇలా ప్రతిపాదించగానే అలా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ పరిణామాలన్నీ కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్యనున్న స్నేహ బంధాన్ని బలపరుస్తున్నాయని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు. తాము వందల విజ్ఞప్తులు చేసినా పట్టించుకోని కేంద్రం.. రేవంత్ వెళ్లిరాగానే అన్నీ మంజూరవుతున్నాయని గుర్తు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఎడాపెడా మంజూరుచేస్తున్నారని దుయ్యబడుతున్నారు.'చంద్రబాబు దత్త పుత్రుడికి మోదీ పెద్దన్న కాకపోతే ఇంకేమైతడు?' సామాజిక మాధ్యమాల్లో సైతం కామెంట్లు కనిపిస్తున్నాయి.

మాకది.. మీకిది

గత లోక్‌సభ ఎన్నికలు, హుజూరాబాద్, మునుగోడు, దుబ్బాక ఉప ఎన్నికల్లో ఏం జరిగిందనేది అందరికీ తెలిసిన విషయమే. బీజేపీ అభ్యర్థులు గెలిచిన చోట కాంగ్రెస్ సీనియర్లు బరిలో ఉన్నా మూడో స్థానానికే పరిమితమయ్యారు. కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో బీజేపీ మూడోస్థానంతో సరిపెట్టుకున్నది. ఈ రెండు పార్టీల మధ్య జరిగిన ముందస్తు ఒప్పందానికి ఇది నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. గత ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ స్థానం నుంచి పొన్నం ప్రభాకర్ బరిలో నిలిచారు. సీనియర్ నేత అయిన ఆయనకు పడాల్సిన ఓట్లు బండి సంజయ్‌కు పడడంతో ఆయన విజయం సాధించారు. మల్కాజిగిరిపై ఏమాత్రం పట్టులేని రేవంత్‌రెడ్డి పోటీచేస్తే బీజేపీ నుంచి క్రాస్ ఓటింగ్ జరగడంతో ఆయన గెలుపొందారు. హుజూరాబాద్, దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల్లోనూ ఇదే జరిగిందన్నది విశ్లేషకుల మాట. ఈసారి కూడా ఇదే ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్న ఒప్పందం ఇరు పార్టీల మధ్య జరిగిందని, పైకి విమర్శలు అందులో భాగమేనని చెప్తున్నారు. అంతేకాదు, గతంలో మోదీని కలవడానికి వెళ్లినప